# పుస్తక పరిచయం




**ఈ పుస్తకం** సమగ్రస్వరూపాన్ని క్లుప్తంగా చెప్పాలంటే , ముందుమాట వ్రాసిన వాడ్రేవు వీరలక్ష్మీదేవిగారి మాటల్లోనే - "నడుస్తున్నంత మేరా లోపలా బయటా కూడా తనని తాను వెతుక్కుంటూ ప్రయాణిస్తున్న యాత్రికుడు శ్రీనివాసరావు ఆచాళ్ళ. ఆ అన్వేషణలో చేతికందిన కాసిన్ని పూలనూ, మరిన్ని గరికపోచలనూ ఆపేక్షగా చూసుకుంటూ, చెట్ల నీడల వెంట సేదదీరుతూ, చిరుగాలులను హత్తుకుంటూ వాటన్నింటినీ అక్షరాలలోకి అనువదించగా సంపుటీకరించబడిన పుస్తకమే ఈ 'నాలో - నేను'. ఈ రచయిత తనలోకి చేసిన తన ప్రయాణంలో ఎదురైన.. పోగుచేసుకున్న పరిమళించే పూలూ, మంచుబిందువులతో మెరిసే గరికపోచలూ, అనురాగంతో సేదదీర్చే చెట్లనీడలూ, ఆత్మీయంగా హత్తుకునే చిరుగాలులూ - ఇవే ఈ పుస్తకంలో కవితలుగా, పాటలుగా, నృత్యరూపకాలుగా, కథలుగా, వ్యాసాలుగా రూపాంతరం చెందాయి. శ్రీనివాసరావుగారు వ్రాసిన సాహితీ ప్రక్రియ ఏదైనా అంతర్గతమైన లయ ఆయన చిరునామా. ఎంచుకున్న అంశం - ప్రియురాలు , స్నేహం, అమ్మా, నాన్నా, యువతా, బాల్యం, దేశం - ఏదైనా.. లయబద్ధమైన భావాలు, ఎక్కడా ఔచిత్యదోషం లేకుండా వాటిని వ్యక్తపరచిన విధానం రచయిత ఆలోచనా ప్రక్రియకి అద్దం పడతాయి. భావాల్లో పరిణితి, రచనా శైలిలో సొంతసంతకం ఈ కవిని / రచయితని ప్రత్యేకంగా నిలబెడతాయి. ఇందులోని ఖండికలను 'గుండె లయతో శృతి కలిపిన కవితలు ',' ప్రాణం ప్రాసగా పల్లవించిన పాటలు',' వేదిక వేడుకలు',' అంతర్మధనాల 'కథ'నాలు ' , ' సహేతుక ప్రహేళికలు నినదించిన వ్యాస'ంగాలు' అనే విభాగాలుగా విభజించారు. ప్రతి ప్రక్రియలోనూ శ్రీనివాసరావుగారు అతిసులభంగా , సరళంగా వ్రాయగలరని ప్రతి కవితా, పాటా, కథా, వ్యాసమూ నిరూపిస్తాయి. అవతారికలోనే 'శిశిరం కొసలో జారిన / భావ స్మృతుల్లు శృతి సేయగ / వేసవి వడగాలులలో / మల్లెల ఓదార్పులుగా / కెంపుకంటి కంఠములో / కొత్త శృతులు పలికించగ / స్వరధారలు పులకించగ / శార్వాణీ ! స్వరరాణీ / కటాక్షించు ఒక్క వరం - ఒక్క స్వరం' అని ఆరంభించి కవిగా తానేమి చెప్పబోతున్నారో స్పష్టం చేశారు శ్రీనివాసరావుగారు. ' నీ కోరిక మేరకు మాత్రమే / నేనీ భూమిపయికి తేబడినవాడినని / నా ప్రగాఢ అనుభూతి' అని చెప్పినా ' మనసులో వలపుల విపంచిక / బ్రతుకులో గెలుపుల మరీచిక / కడవరకూ తీరని మోహమిది / కన్నీరు తీర్చని దాహమిది ' అని వ్రాసినా, 'చిరునవ్వు నను నీవలె విడిచె / కన్నుల నీరే తోడుగ నిలిచె / కలలు కరిగీ నా కలత హృదయమే / కలువరించి నిను పిలిచే వేళ' అని వ్యధచెందినా - వ్రాసిన ప్రతివాక్యాన్ని పాఠకుల హృదయాలకి చేర్చడంలో రచయిత కృతకృత్యులయ్యారనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఇందులోని నృత్యరూపకాలు ఎప్పుడైనా, ఎవరైనా ప్రదర్శించడనికి వీలుగా ఉన్నాయి. వాటికోసం ఎంచుకున్న అంశాలు కూడా సార్వజనీనంగా ఉన్నాయి. చివరలోచేర్చిన కథలూ, వ్యాసాలూ కూడా శ్రీనివాసరావు గారి కవితా శైలిలోలోనే కొనసాగి, తక్కువ నిడివిలో చక్కటి భావాలని ఎలా వ్యక్తపరవచ్చో తెలియచేస్తాయి. శ్రీనివాసరావుగారి కలంనుంచి ఇలాంటి మంచి సాహితీ ఖండికలు విరివిగారావాలని ఆశిద్దాం. ★★★

For Copies:

*ఆచాళ్ళ శ్రీనివాసరావు*

srinivisaraoachalla@gmail.com
097869 91947
Also in all leading book stores.




*మండాడి కృష్ణయ్య*

*9885999746*

***Available in all leading books stores***

**క్లుప్తత, స్పష్టత,** సరళతతో బాటు నిబద్ధత, నిజాయితీ నిండుగా ఉన్న మినీ కవితలివి. కవితా ముక్తకాలు అన్నారు రచయిత మందాడి కృష్ణయ్యగారు. ఒక్కోసారి ఈ ముక్తకాలు చదువుతుంటే వేమనపద్యాలు, కబీర్ పదాలు కూడా తలపుకొస్తాయి. వ్రాసిన ప్రతి పంక్తీ ఎంతో ఆలోచనతో వ్రాసినట్లు, ఇందులోని ఏ కవితను తీసుకున్నా స్పష్టమౌతుంది. "తీసిన కొద్దీ చెలమలో / నీరు ఊరుతుంది / చదివిన కొద్దీ మనిషిలో / వివేకం పెరుగుతుంది " - "భూమిలో నీరు ఎలాంటిదో / గుండెలో తడి అలాంటిది / భూమిలో విత్తనం అంకురిస్తుంది / గుండెలో కరుణ వెల్లివిరుస్తుంది " . ఇలాంటి ముక్తకాలు ఎప్పుడైనా ఉదహరించగలిగేలా ఉన్నాయి. ముందుమాటలో రచయిత చెప్పారు " కార్మికుడు, కర్షకుడు, సైనికుడు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విలేకరులు, కళాకారులు - సమాజంలోకి వీరందరినీ ఆవాహన చేసుకొని ప్రవాహంలా కవిత్వాన్ని సృష్టించే కవులు. అలా నేనూ కవిత్వం వ్రాస్తున్నాను" అని. అలానే వీరిని పరిచయం చేస్తూ "పుస్తక పఠనం, సమాజ పరిశీలన, తోటివారి కష్టసుఖాల అవగాహన ఉన్నవారు " అన్నారు డా.పి.భాస్కరయోగిగారు. ఈ పుస్తకంలోని ఏ కవిత చదివినా ఆ వాక్యాలు యదార్థాలని తెలుస్తుంది. ఇంతకుముందే 'అరుణకిరణాలు' , 'భూమిపుత్రుడు' అనే రెండు సంపుటాలను ప్రచురించారు. 'అమృతభాండం' పేరుతో ఆణిముత్యాల్లాంటి సూక్తులను సేకరించారు. ఈ ఆల్చిప్పలో అమృతబిందువు పుస్తకాన్ని అంకింతమివ్వడంలోనే సమాజంపట్ల ఈ కవి దృక్పథం స్పష్టమౌతుంది. ఈ పుస్తకాన్ని ప్రజాస్వామ్య పరిరక్షణలో తమవంతు కృషిచేసిన ఎన్.టి.రామారావుగారికి, ఎస్.ఆర్.శంకరన్ గారికి, జస్టిస్ ఆవుల సాంబశివరావుగారికి, సురవరం ప్రతాపరెడ్డిగారికి అంకితమిచ్చారు. కేవలం నీతిసూక్తుల్లాంటి ముక్తకాలే కాక వివిధ రంగాల్లో ప్రసిద్ధమైన వ్యక్తులగురించి, వివిధ అంశాల గురించి కూడా మినీ కవితలు ఉన్నాయి ఈ పుస్తకంలో. "ఆయన చిత్రం అపురూపం / చిత్రకారుల్లో మణిదీపం / చందమామలోని మామయ్య / శ్రీకాకుళంలోని వడ్డాది పాపయ్య", "వచన కవితా పితామహుడు / మన ప్రజాకవి కుందుర్తి / మినీకవుల సాహిత్య ఆర్తికి / ఆయనే కదా స్ఫూర్తి!" . ఇలాంటి భావాలతో ప్రముఖులని అక్షరబద్ధం చేశారు. పుస్తకం అంతా చదివాక నిజాయితీ నిండిన అనుభూతి మిగులుతుంది.

★★★★

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**